
కో-ఆప్షన్ రగడ.. 2


ఇసుక టిప్పర్ సీజ్ 3

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

23-5-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## మార్కెట్ వాల్యూ అప్డేషన్ వేగవంతం చేయాలి

**అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ:** రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ వాల్యూ అప్డేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్ కుమార్, రెవెన్యూ శాఖ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో శనివారం వీసీలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూభారతి ఐజీఆర్ఎస్ పోర్టల్‌లో ఫాం.1,2,3,4లకు సంబంధించిన అప్డేషన్ ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. జీవో.44 ప్రకారం జిల్లాస్థాయి నుండి మండల స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేసి మార్కెట్ వాల్యూ సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.




## పీసీసీ చీఫ్‌పై వ్యక్తిగత దాడిని ఖండిస్తున్నాం

**డీసీసీ నగరాధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ**

**అక్షరటుడే, ఇందూరు:** పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌పై వ్యక్తిగత దాడిని డీసీసీ తీవ్రంగా ఖండిస్తోందని కాంగ్రెస్ నగరాధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ అభివృద్ధికి పీసీసీ చీఫ్ ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. కానీ ఓ టీవీ ఛానల్‌లో ఆయనను ఒక విఫల పీసీసీ చీఫ్‌గా చూపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 20 ఏళ్లుగా ఇలాంటి వ్యక్తిగత దాడి ఏ పీసీసీ అధ్యక్షుడి మీద జరగలేదన్నారు. ఆయనను టార్గెట్ చేయడంలో అర్థం లేదని పేర్కొన్నారు. తెలంగాణ రాజకీయాల్లో బీసీ రాజ్యాధికార కాంక్ష ఇటీవల కాలంలో తారాస్థాయికి చేరుకుందన్నారు. సమీప భవిష్యత్తులో వచ్చే ఏ ఎన్నికల్లో అయినా బీసీలకు రాజకీయ ప్రాధాన్యం పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. మహేష్ గౌడ్‌ను రేవంత్ రెడ్డి తన కొలువులో చేర్చుకుని.. అవసరమైతే బీసీ కోటలో డిప్యూటీ సీఎం పదవిని అప్పచెబుతారనే ఇటీవల సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో అనూహ్యంగా మహేష్ గౌడ్ పీసీసీ చీఫ్‌గా ఫెయిల్ అయ్యారని కొన్ని ఛానళ్లు బద్నాం చేస్తున్నాయని ఆరోపించారు. ఒక బలమైన బీసీ నేత మీద జరుగుతున్న ఈ విషపు దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని.. మహేష్ గౌడ్‌కు జిల్లా కాంగ్రెస్ తరపున అన్నివిధాలుగా మద్దతుగా నిలబడతామన్నారు.

గ్రామాల్లో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, పల్లెల సమగ్ర అభివృద్ధికి చోదక శక్తులుగా నిలవాల్సిన పంచాయతీ కార్యదర్శులు కొందరు దారితప్పుతున్నారు. విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగం, ఉచిత సేవల కోసం లంచాల వసూళ్లకు పాల్పడుతూ సస్పెన్షన్ల పాలవుతున్నారు. ప్రస్తుతం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఉన్నతాధికారుల నుంచి మెమోలు, షోకాజ్ నోటీసులు అందుకున్న వారి సంఖ్య డజన్లలో ఉండటం గమనార్హం.

– అక్షరటుడే, భీమ్‌గల్



# జీపీ కార్యదర్శుల ఇష్టారాజ్యం!

■ విధుల్లో నిర్లక్ష్యం ■ ప్రజల నుంచి డబ్బుల వసూలు
■ ఇంటి పర్మిషన్ కోసం లంచం డిమాండ్ ■ కఠిన చర్యలు చేపడుతున్న అధికారులు

గ్రామ పంచాయతీల 15వ ఆర్థిక సంఘం నిధులను నిబంధనలకు విరుద్ధంగా మళ్లించడం, చేయని పనులకు నకిలీ బిల్లులు సృష్టించడం వంటి ఉదంతాలు ఉమ్మడి జిల్లాలో కలకలం రేపుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలో ఇళ్ల నిర్మాణ అనుమతులు, మ్యూటేషన్ల వ్యవహారంలో నిబంధనలు ఉల్లంఘించిన ముగ్గురు కార్యదర్శులపై ఇటీవలే సస్పెన్షన్ వేటు పడింది. పారిశుధ్యాన్ని గాలికొదిలేసిన కొందరు జూనియర్ కార్యదర్శులకు నోటీసులు జారీ అయ్యాయి. గతంలోనూ రెంజల్ (సాటాపూర్), డిచ్‌పల్లి మండలాల్లో నకిలీ బిల్లులతో నిధులు డ్రా చేసినందుకు, ఆర్మూర్, రుద్రూర్ మండలాల్లో అక్రమ లేఅవుట్లకు ఇళ్ల నంబర్లు కేటాయించి, ఈజీఎస్ పనుల్లో అలసత్వం వహించినందుకు కార్యదర్శులు సస్పెండయ్యారు.

### కామారెడ్డి జిల్లాలో..

నిధుల దుర్వినియోగం ఆరోపణలపై ఇద్దరు కార్యదర్శులను ఉద్యోగాల నుంచి తొలగించగా, మరి కొందరిపై విచారణ సాగుతోంది. గతంలో లింగంపేట, గాంధారి మండలాల్లో ప్రభుత్వ నిధుల దారి మళ్లింపు, చెక్కులపై ఫోర్జరీ సంతకాల వ్యవహారంలో కార్యదర్శులపై అధికారులు వేటు వేశారు.

### క్షేత్రస్థాయికి వెళ్లకుండానే..

పారిశుధ్య పనుల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం 'డైలీ శానిటేషన్ రిపోర్ట్' యాప్ తీసుకొచ్చింది. పంచాయతీ కార్యదర్శులు పనుల వివరాలను నిత్యం ఈ యాప్‌లో నమోదు చేయాలి. అంతేగాకుండా విధులకు హాజరైనట్లు యాప్‌లో ఫొటో తీసుకోవాలి. అయితే ఈ రెండు విషయాల్లో కొందరు కార్యదర్శులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. క్షేత్రస్థాయికి వెళ్లకుండానే పారిశుధ్య పనుల వివరాలు ఇష్టం వచ్చినట్లు నమోదు చేస్తున్నారు. ఉదయం 10 గంటల లోపు ముఖ గుర్తింపు హాజరు విధానంలో అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇలా అక్రమాలకు పాల్పడిన 40 మందికి గత ఆరు నెలల్లో ఉన్నతాధికారులు మెమోలు జారీ చేశారు.

### ఉమ్మడి జిల్లాలో కార్యదర్శుల వివరాలు..

| జిల్లా మొత్తం పోస్టులు | నిజామాబాద్ | కామారెడ్డి |
|---|---|---|
| సీనియర్/గ్రేడ్ కార్యదర్శులు | 530 | 526 |
| జూనియర్ కార్యదర్శులు | 210 285 | 195 290 |

### కఠిన చర్యలు తప్పవు

విధులపై నిర్లక్ష్యం వహించినా, నిధుల దుర్వినియోగానికి పాల్పడినా సహించేది లేదు. అక్రమ మ్యుటేషన్లు, నిధుల మళ్లింపుపై ఫిర్యాదులు వస్తే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొందరిని సస్పెండ్ చేశాం, మరికొందరికి మెమోలు ఇచ్చాం.

– జిల్లా పంచాయతీ అధికారి, నిజామాబాద్



## నిజామాబాద్ అడిషనల్ కలెక్టర్‌గా వి.భుజంగరావు నియామకం

**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా వి.భుజంగరావు నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలో ఖాళీగా ఉన్న అడిషనల్ కలెక్టర్ పోస్టులో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ కేడర్‌కు చెందిన వి. భుజంగరావును నియమిస్తూ సాధారణ పరిపాలన శాఖ శుక్రవారం ద్వారా ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర గవర్నర్ పేరిట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు ఈ బదిలీ, నియామక ఉత్తర్వులపై సంతకం చేశారు. ఈ ఉత్తర్వులను సంబంధిత అధికారికి, కలెక్టర్‌కు, ట్రెజరీ కార్యాలయానికి సమాచారం నిమిత్తం పంపినట్లు నివేదికలో పేర్కొన్నారు. జిల్లాలోని స్థానిక సంస్థల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను, పరిపాలనను ఈ కొత్త నియామకం మరింత వేగవంతం చేయనుందని భావిస్తున్నారు.



## జిల్లాలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు.. వారంలోనే 162 మందికి జరిమానాలు..

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలను పక్కాగా నిర్వహిస్తున్నామని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. వారం రోజుల్లో నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ తనిఖీలు జరిగాయని సీపీ తెలిపారు. ఇందులో భాగంగా 162 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించామన్నారు. అనంతరం వారిని ఆయా కోర్టులలో ప్రవేశపెట్టగా 160 మందికి రూ.16 లక్షల జరిమానాలు విధించారని ఇద్దరికి వారం రోజులపాటు కోర్టు జైలుశిక్ష విధించినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిరంతర ప్రక్రియ అని మద్యం తాగి వాహనాలతో రోడ్లపైకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో అన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో తనిఖీలు నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల వారితో పాటు ఇతరులకు సైతం ప్రాణహాని ఉన్నదని.. ఇలాంటివారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు.

## అధైర్య పడొద్దు.. ఆదుకుంటాం: భూపతిరెడ్డి



**అక్షరటుడే, డిచ్ పల్లి:** ఇటీవల గాలివాన బీభత్సంతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. మోపాల్ మండలం మంచిప్ప, బైరాపూర్ గ్రామాల్లో జరిగిన నష్టాన్ని ఆయన శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన నష్టాన్ని, ఇళ్లు కోల్పోయిన బాధితులను పరామర్శించారు. బాధితుల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడొద్దని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మంచిప్పలో 16 కుటుంబాలకు, బైరాపూర్‌లో నష్టపోయిన 16 కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఇళ్లు కోల్పోయిన బాధితులు ఎమ్మెల్యే వద్ద బావోద్వేగానికి గురికాగా.. ధైర్యంగా ఉండాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా కల్పించారు. విద్యుత్, వ్యవసాయ, రెవెన్యూ సంబంధిత అధికారులతో మాట్లాడి పలు వివరాలు తెలుసుకున్నారు. నష్టాన్ని అంచనా వేసి.. బాధితులకు పరిహారం అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఎంసీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, రాష్ట్ర గీత కార్మిక సహకార కార్పొరేషన్ ఛైర్మన్ శేఖర్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మోపాల్ సాయరెడ్డి, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు జలంధర్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి, కాంగ్రెస్ నాయకులు ప్రతాప్ సింగ్ , మంచిప్ప సర్పంచ్ గంగామణి ఉన్నారు.



## 'అర్బన్'కు నిధులివ్వని కాంగ్రెస్ ప్రభుత్వం : ధన్‌పాల్

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** అర్బన్ అభివృద్ధికి నిధులు తీసుకురాలేని కాంగ్రెస్ ప్రతినిధులు రాజీనామా చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లయినా ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేదని విమర్శించారు. జిల్లాపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ ప్రజలను మభ్యపెడుతూ ముందుకు సాగుతోందన్నారు. వైఎస్ఆర్, డీఎస్ మాదిరిగా.. రేవంత్ రెడ్డి, మహేష్‌కుమార్ గౌడ్ జోడీ లక్కీ అంటున్నారు కానీ..కేవలం వారి జేబులు నింపుకోవడానికే జోడీ కలిసిందన్నారు. అర్బన్ విషయంలో అనేక సార్లు మంత్రులను, అధికారులను కలిసి వినతులు అందించినా..లాభం లేకుండా పోతుందన్నారు. ప్రభుత్వ పెద్దలు జిల్లాలో అనేక మంది ఉన్నా.. నిధులు తేవడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఖమ్మం, కరీంనగర్, వరంగల్‌కు ఓఆర్ఆర్ మంజూరు చేశారు కానీ నిజామాబాద్‌పై చిన్నచూపు ఎందుకని ఎమ్మెల్యే ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికలకు ముందు ఫిబ్రవరిలో స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి జిల్లాకు వచ్చి ఓఆర్ఆర్ తీసుకొస్తానంటూ ప్రకటించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం కాంగ్రెస్‌దేనని... పీసీసీ ప్రెసిడెంట్ జిల్లా వాసి అని.. ఇద్దరు ప్రభుత్వ సలహాదారులు, ఛైర్మన్లు జిల్లా నుంచే ఉన్నారన్నారు. రూరల్ ఎమ్మెల్యే కాంగ్రెస్‌కు చెందిన వ్యక్తే అయినా.. నగరానికి రింగ్‌రోడ్డు తేలేకపోయారని విమర్శించారు. సీఎం వైఎస్సార్ హయాంలోనే జిల్లాకు 52 కిలోమీటర్ల ఓఆర్ఆర్ ప్రణాళిక సిద్ధమైందన్నారు. ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదన్నారు. కేవలం 11కి.మీ బైపాస్ రోడ్డును 12 ఏళ్లుగా పూర్తి చేయకుండా నత్తనడకన నడిపిస్తున్నారని విమర్శించారు. అలాగే ఖమ్మం, వరంగల్, కరీంనగర్‌కు ఆయా అభివృద్ధి పనుల కోసం రూ.5,620 కోట్లు నిధులు వచ్చాయన్నారు. ఈ క్రమంలో నిజామాబాద్‌ను మాత్రం విస్మరించారన్నారు.

## మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం రాజ్యాంగ విరుద్ధం: మున్సిపల్ ఛైర్‌పర్సన్



**అక్షరటుడే, కామారెడ్డి:** మున్సిపల్ అధికారులతో క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కేవీఆర్ సమావేశం నిర్వహించడం రాజ్యాంగ విరుద్ధమని కామారెడ్డి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి అన్నారు. ఎమ్మెల్యేకు కేవలం ఎక్స్ అఫీషియో సభ్యత్వం మాత్రమే ఉంటుందని గుర్తు చేశారు. మున్సిపల్ అధికారులతో క్యాంప్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే సమావేశం నిర్వహించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. కామారెడ్డి మున్సిపాలిటీని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నుంచి నడిపించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై మున్సిపల్ ఛైర్‌పర్సన్ తప్పుబట్టారు. మున్సిపల్ అధికారులందరితో మే 23న క్యాంప్ ఆఫీస్‌లో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి కార్యాలయం నుంచి కమిషనర్‌కు లేఖ రావడం, అధికారులపై ఒత్తిడి చేసి సమావేశం నిర్వహించడం అప్రజాస్వామికమన్నారు. తెలంగాణ మున్సిపాలిటీ చట్టం2019.. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఈ సమావేశం గురించి ఎన్నికైన ఛైర్‌పర్సన్‌కు కనీస సమాచారం లేకపోవడాన్ని తప్పుపట్టారు. మున్సిపాలిటీలు రాజకీయ నాయకుల సొంత ఆస్తులు కావని, 74వ రాజ్యాంగ సవరణ ప్రకారం ప్రజలతో ఎన్నికైన ఛైర్‌పర్సనే మున్సిపాలిటీకి రాజకీయ అధిపతి అని నొక్కి చెప్పారు. చట్టప్రకారం ఎమ్మెల్యే కేవలం ఒక ఎక్స్‌అఫీషియో సభ్యుడు మాత్రమేనని, వారికి ఎలాంటి కార్యనిర్వాహక అధికారాలు ఉండవని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మున్సిపాలిటీకి ఇచ్చే ఆదేశాలు ఏ మాత్రం చెల్లవని, ఏ నిర్ణయమైనా మున్సిపల్ కౌన్సిల్ తీసుకోవాల్సిందేనని గుర్తు చేశారు. కామారెడ్డి మున్సిపాలిటీని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఎక్స్‌టెన్షన్ కౌంటర్‌గా మార్చలేరని, ప్రజాస్వామ్య సంస్థలు రాజకీయ బెదిరింపుల కింద పనిచేయవని హెచ్చరించారు. అధికార యంత్రాంగంపై ఒత్తిడి తీసుకువచ్చి, బెదిరింపులకు దిగి, ప్రజలతో ఎన్నికైన ఛైర్మన్, కౌన్సిలర్లను పక్కనపెట్టి ఎమ్మెల్యే తన సొంత కార్యాలయంలో సమావేశం నిర్వహించడం తగదన్నారు. తనకు సమాచారం ఇవ్వకుండా ఈ సమావేశానికి హాజరైన ప్రతి ఒక్క అధికారి నుంచి వివరణ కోరుతామని తెలిపారు.

## మమ్మదేవి కాలనీలో అగ్నిప్రమాదం

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలోని ఖిల్లా సమీపంలో ఓ ఇంట్లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఫైర్ స్టేషన్ అధికారి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఖిల్లా సమీపంలో పోచమ్మగుడి వద్ద మమ్మదేవి కాలనీలో కంది ప్రశాంత్ అనే వ్యక్తి తన ఇంట్లో గడ్డి కట్టలు ఉంచగా షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కట్టలకు నిప్పు అంటుకుని తలగబడుతుండగా సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.



## ఎల్లారెడ్డి మున్సిపల్ సమావేశంలో అభివృద్ధి పనులకు ఆమోదం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం ఛైర్మన్ శ్రీకాంత్ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. పట్టణాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించిన పలు కీలక అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానించారు. పురపాలక సంఘ పరిధిలోని అన్ని వార్డుల్లో నీటి ఎద్దడి సమస్యను నివారించేందుకు కొత్త బోరు మోటార్ల కొనుగోలు కోసం రూ. 20 లక్షల నిధులను కేటాయించారు. వీధి దీపాల సమస్య పరిష్కారం కోసం 36వాట్స్, 50వాట్స్, 100వాట్స్ సామర్థ్యంతో హైమాస్ట్ లైట్ల కొనుగోలుకు రూ.10 లక్షలు మంజూరు చేశారు. అలాగే పలు వార్డుల్లో కల్వర్టులు, చిన్న మురికి కాల్వల నిర్మాణం కోసం మరో రూ.10 లక్షలను ఆమోదించారు. పారిశుధ్య సిబ్బంది సంక్షేమం దృష్ట్యా వారికి నెలసరి సబ్బులు, ఇతర అవసరమైన వస్తువులను అందించడంతో పాటు కార్యాలయ సిబ్బంది అందరికీ రూ.10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని తీర్మానించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రజలు దోమల బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రజల అవసరాల నిమిత్తం బాడీ ఫ్రీజర్‌ను కొనుగోలు చేయడానికి, పట్టణంలో కోతులు, పందులు, కుక్కల బెడదను నివారించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. సమావేశంలో వైస్‌ఛైర్మన్ భాగ్యమ్మ, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ జీవన్ పాల్గొన్నారు.





## ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు సేకరించాలి

**అక్షరటుడే, బాల్కొండ:** జనగణన తొలిదశలో భాగంగా గణకులు ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని అడిషనల్ ఛార్జ్ ఆఫీసర్, ఎంఈవో బట్టు రాజేశ్వర్ సూచించారు. బాల్కొండ, చిట్టాపూర్, బోదేపల్లి, వన్నెల్ (బీ) తదితర గ్రామాల్లో జరుగుతున్న ఇళ్ల జాబితా, గృహ గణన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణన దేశ అభివృద్ధికి కీలకమని, ఈ ప్రక్రియలో భాగస్వాములు కావడం అదృష్టంగా భావించాలని అన్నారు. ప్రజలు ఇంటింటికి వచ్చే గణకులకు పూర్తి, సరైన వివరాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్ సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్య, వైద్యం, ఉపాధి వంటి రంగాల ప్రణాళికల రూపకల్పనకు జనగణన గణాంకాలు ఎంతో కీలకమని తెలిపారు. జనగణన కార్యక్రమాన్ని పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహిస్తున్నామని చెప్పారు.

## 26న పసుపు, వరి రైతులు, ఎగుమతిదారుల అవగాహన సదస్సు



**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** ఈనెల 26న పసుపు, వరి రైతులు, ఎగుమతిదారుల అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సురేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ, విదేశీ వాణిజ్య డైరెక్టర్ జనరల్.. 'జిల్లాను ఎగుమతి కేంద్రంగా' ప్రకటించారన్నారు. ఇలా దేశవ్యాప్తంగా 120 ప్రాధాన్య జిల్లాల్లో నిజామాబాద్ కూడా ఒకటన్నారు. కొత్తగా ఎగుమతిదారులను సృష్టించడం, ఎంఎస్ఎంఈల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు. కలెక్టర్ అధ్యక్షతన 26న ఉదయం నిజామాబాద్ కలెక్టరేట్‌లో మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించామన్నారు.

## తిమ్మారెడ్డి సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మండలం తిమ్మారెడ్డి సొసైటీ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, తహశీల్దార్ ప్రేమ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలు, తూకం యంత్రాలు, తేమ యంత్రాల పనితీరును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. రైతుల నుంచి ధాన్యం సేకరణలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని, దళారుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు జరపాలని సిబ్బందిని ఆదేశించారు. కేంద్రంలో రైతులకు తాగునీరు, నీడ వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉంచాలని సీఈవోకు సూచించారు. ధాన్యం బస్తాలు తరలించే వాళ్ల లారీలను ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు. ప్రభుత్వం రైతు పక్షపాతి అని, చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రేమ్ కుమార్, మండల వ్యవసాయ అధికారిణి శోభ, సొసైటీ సీఈవో రామచందర్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్ సీజ్




**అక్షరటుడే, మెండోరా:** ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్‌ను సీజ్ చేశారు. ఈమేరకు మెండోరా ఎస్సై సుహాసిని తెలిపిన వివరాల ప్రకారం.. మెండోరా పోలీసులు దూదిగాం చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో జగిత్యాల జిల్లా మల్లాపూర్ నుంచి నిర్మల్‌కు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను ఆపారు. డ్రైవర్ వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడంతో టిప్పర్‌ను సీజ్ చేశారు. అనంతరం డ్రైవర్ నాగరాజు, యజమాని ఈశ్వర్‌పై కేసు నమోదు చేసినట్లు మెండోరా ఎస్సై సుహాసిని తెలిపారు.

జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో ఇప్పటికే కో–ఆప్షన్ ఎన్నిక ముగిసింది. కానీ ఆర్మూర్ బల్దియాలో మాత్రం ఈ ఎన్నికపై ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లేదు. బల్దియా కొలువుదీరి మూణ్నెళ్లు కావస్తున్నా కో–ఆప్షన్ సభ్యుల ఎంపికపై ఎందుకు జాప్యం చేస్తున్నారో తెలియక ఆశావహులు తలలు పట్టుకుంటున్నారు. అయితే వర్గపోరే కారణమని పలువురు చర్చించుకుంటున్నారు.

– అక్షరటుడే, ఆర్మూర్




# కో-ఆప్షన్ రగడ..

- ఆర్మూర్ మున్సిపాలిటీలో నియామకాలపై సందిగ్ధత
- ఆశావహుల ఎదురుచూపులు
- పలు మున్సిపాలిటీల్లో ఇప్పటికే ముగిసిన కో–ఆప్షన్ సభ్యుల నియామకం
- వర్గపోరే కారణమంటున్న నాయకులు

జిల్లాలో ఆర్మూర్ మినహా అన్ని మున్సిపాలిటీల్లో కో-ఆప్షన్ సభ్యుల నియామకాలు పూర్తయ్యాయి. కానీ ఆర్మూర్ బల్దియాలో మాత్రం ఈ ప్రక్రియపై ఎలాంటి హడావుడి లేకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. మున్సిపల్ పాలకవర్గం కొలువుదీరి మూడు నెలలు గడుస్తున్న నలుగురు కో-ఆప్షన్ సభ్యుల ఎంపికపై ప్రస్తుతం సందిగ్ధత నెలకొంది. 36 వార్డులకు గాను 19 కౌన్సిల్ స్థానాలను కైవసం చేసుకుని కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ మున్సిపాలిటీని కైవసం చేసుకుంది. గత బీఆర్ఎస్ హయాంలోనూ కో-ఆప్షన్ సభ్యుల నియామకంపై జాప్యం జరిగింది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలోనూ అదే జాప్యం జరుగుతుండడంతో పార్టీ నేతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కష్టకాలంలో అండగా నిలబడ్డ పలువురు కాంగ్రెస్ నాయకులు కో-ఆప్షన్ పదవులపై గంపెడాశలు పెట్టుకున్నారు. కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక ముందుకు సాగకపోవడంతో వారంతా నిరాశకు గురవుతున్నారు.

### నాలుగు కో-ఆప్షన్ స్థానాలు..

ఆర్మూర్ మున్సిపాలిటీలో 36 వార్డులకు గాను 19 కాంగ్రెస్, 8 స్థానాల బీజేపీ, 5 బీఆర్ఎస్, ఏంఐఎం 1, ఇండిపెండెంట్ 3 స్థానాలు ఉన్నాయి. ఈ బలాబలాలతో సభ్యుల ఎన్నిక జరుగాల్సి ఉంది. కానీ మూణ్నెళ్లు గడిచినా ఈ ప్రక్రియకు సంబంధించి ఎలాంటి నోటిఫికేషన్ రాకపోవడం చర్చకు దారితీసింది. దీంతో ఆశావాహులు నియామక నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు.

### వర్గ పోరే కారణమా..?

నాలుగు కో-ఆప్షన్ సభ్యుల్లో రెండు మైనారిటీ, రెండు జనరల్ స్థానాలకు అధికార కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఉంది. అయితే ఆ పార్టీ నేతల మధ్య వర్గ పోరే కో-ఆప్షన్ సభ్యుల నియామాక ప్రక్రియ ఆలస్యానికి కారణమని పలువురు బాహాటంగానే ఆరోపిస్తున్నారు. తమ అనుచరులకే పదవులు దక్కాలని ఆర్మూర్ నియోజకవర్గ ముఖ్యనేతతో పాటు కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఇరువురు పట్టుబడుతున్నట్లు తెలిసింది. ఇద్దరు నేతల మధ్య సయోధ్య కుదరకపోవడమే జాప్యానికి కారణంగా పలువురు చర్చించుకుంటున్నారు. మరోవైపు సర్పంచ్, కౌన్సిలర్‌గా గతంలో పనిచేసి అనుభవం ఉన్నవారికి కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నుకోవాలన్న మున్సిపల్ నిబంధనలతో కొన్నేళ్లుగా జెండా మోసిన కార్యకర్తలు, నాయకులకు నిరాశే ఎదురవుతోంది. కాంగ్రెస్ అధిష్టానం ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుంటే తప్ప ఈ ప్రక్రియ ముందుకు సాగేలా కనిపించడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



## న్యాయవాది హత్య హేయమైన చర్య..

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్ వద్ద న్యాయవాది ఖాజా మొయినుద్దీన్ హత్య అత్యంత హేయమైన చర్య అని న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ తీవ్రంగా అన్నారు ఈ మేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. దుండగులు పథకం ప్రకారం కారుతో న్యాయవాదిని ఢీకొట్టి పారిపోయారని, ఆయన ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారన్నారు. ఈ ఘటనను తర్వాత హత్య కేసుగా మార్చడం న్యాయవాదుల సమాజంలో భయందోళనను సృష్టించిందన్నారు. ఈ ఘటనపై సమగ్రమైన, నిష్పక్షపాతమైన, వేగవంతమైన దర్యాప్తు జరిపించాలని న్యాయవాద పరిషత్ డిమాండ్ చేస్తోందన్నారు. పోలీసు అధికారులు సంబంధిత వ్యక్తులందరినీ గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాది ఖాజా మొయినుద్దీన్‌కు న్యాయం కోసం న్యాయవాదుల సమాజం మొత్తం ఐక్యంగా నిలబడుతుందన్నారు.

## సప్దల్‌పూర్‌లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని శనివారం సప్దల్‌పూర్‌లో నిర్వహించారు. రుద్రూర్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఫిర్దోజ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వరిలో అధిక దిగుబడినిచ్చే మేలు రకాల విత్తనాల గురించి వివరించారు. వివిధ పంటల సాగు విధానాలు, చీడపీడల నివారణ, సమగ్ర ఎరువుల యాజమాన్యంపై రైతులకు సూచనలు చేశారు. వరి పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం దెబ్బతినడంతో పాటు పర్యావరణానికి కలిగే నష్టాలను తెలియజేశారు. వరి కొయ్యలను పొలంలోనే కుళ్లబెట్టడం వల్ల భూమికి సేంద్రియ పదార్థం అంది భూసారం పెరుగుతుందని వివరించారు. సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యత, భూసార పరీక్షల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్, మండల వ్యవసాయ అధికారిణి శోభ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్, మాత్రల పంపిణీ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** కొక్కొండ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం సర్పంచ్ వెంకవ్వ, ఉప సర్పంచ్ ప్రణీత్ కుమార్ తనిఖీ చేశారు. పనులు జరుగుతున్న ప్రదేశాన్ని సందర్శించి, కూలీలతో మాట్లాడారు. మస్టర్ రోల్ ప్రకారం కూలీల హాజరును పరిశీలించి, పనుల నాణ్యతను పరిశీలించారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని పేర్కొన్నారు. వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మాత్రలను పంపిణీ చేశారు. తప్పనిసరిగా నీడలో విశ్రాంతి తీసుకోవాలని, తగినన్ని నీళ్లు తాగాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పనుల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా పారదర్శకంగా వ్యవహరించాలని ఉప సర్పంచ్ ప్రణీత్ కుమార్ తెలిపారు.

## ఇసుక కుప్పలో పసికందు మృతదేహం

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలోని ముషీరాబాగ్ ప్రాంతంలో ఈ హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. పట్టణంలోని ముషీరాబాగ్ ప్రాంతంలోని ఇసుక కుప్పలో రెండు రోజుల వయసున్న పసికందు విగతజీవిగా పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. ఈ ఘటనతో ప్రాంతంలో తీవ్ర కలకలం రేగింది. శనివారం ఉదయం ఆ దారిన వెళ్తున్న వారు ఇసుక కుప్పలో పసికందు మృతదేహాన్ని చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న కామారెడ్డి పట్టణ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అభం శుభం తెలియని ఆ చిన్నారిని ఎవరు వదిలేసి వెళ్లారనే దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. బిడ్డను పోషించలేక వదిలేశారా..? లేక ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని, చుట్టుపక్కల సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తున్నారు. ఆస్పత్రుల్లో ఇటీవల జరిగిన ప్రసవాల వివరాలను కూడా ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఖననం చేసిన పసికందును కుక్కలు లాక్కొచ్చాయి..

సీఐ నరహరి మాట్లాడుతూ.. శుక్రవారం ఉదయం పెద్ద కొడప్‌గల్‌కు చెందిన ఓ గర్భిణి కామారెడ్డి ఆస్పత్రిలో పసికందుకు జన్మనిచ్చిందన్నారు. అయితే ఆ పసికందు మృతి చెందడంతో కామారెడ్డిలో ఖననం చేశారన్నారు. ఖననం సరిగా చేయకపోవడంతో కుక్కలు లాక్కుని వచ్చి ముషీరాభాగ్ కాలనీలో పడేశాయన్నారు. డయల్ 100కు రాగానే వెళ్లి పరిశీలించి పసికందు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించామని తెలిపారు.

## ఫీజు నియంత్ర చట్టాన్ని అమలు చేయాలి




**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్ర చట్టాన్ని అమలు చేయాలని పీడీఎస్‌యూ ఆర్మూర్ శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించింది. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు నిఖిల్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ప్రతి ఏడాది దాదాపు 20 నుంచి 30 శాతం వరకు ఫీజులను పెంచుతున్నారన్నారు. దీంతో పేద మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో పేద మధ్య తరగతి విద్యార్థులే చదువుకుంటున్నారన్నారు. పర్మిషన్ లేకుండా కొనసాగుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, ప్రత్యేకంగా ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు పర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్, ఏరియా ప్రధాన కార్యదర్శి రాజు, కార్యదర్శి సిద్ధార్థ్, నాయకులు వినోద్, ప్రణయ్, రేవంత్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆలూర్‌లో కొనసాగుతున్న గృహ గణన కార్యక్రమం

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండల కేంద్రంలో సెన్సస్-2027లో భాగంగా గృహఃగణన కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా జనాభా గణన వివరాల నమోదు ప్రక్రియను సెన్సస్ ఛార్జ్ ఆఫీసర్, ఆలూర్ తహశీల్దార్ రమేష్, అడిషనల్ ఛార్జ్ ఆఫీసర్ నరేందర్ పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి వివరాలను నమోదు చేసే ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ప్రతి కుటుంబ వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఛార్జ్ ఆఫీసర్ రమేష్ మాట్లాడుతూ.. సెన్సస్-2027లో ప్రతి ఇంటి వివరాలను సక్రమంగా నమోదు చేయడం ద్వారా గ్రామాభివృద్ధి ప్రణాళికలు, సేవల విభజనలో ఖచ్చితత్వం సాధ్యమవుతుందన్నారు. ప్రజలు కూడా సిబ్బందికి సరైన సమాచారం అందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఛార్జ్ ఆఫీసర్, ఆలూర్ తహశీల్దార్ రమేష్,అడిషనల్ ఛార్జ్ ఆఫీసర్ నరేందర్, సూపర్‌వైజర్ రాజేష్, ఎన్యూమరేటర్ పాల్గొన్నారు.

## రెంజర్ల సొసైటీలో జీలుగ విత్తనాల పంపిణీ



**అక్షరటుడే, ముప్కాల్:** రెంజర్ల సొసైటీలో సబ్సిడీపై జీలుగు విత్తనాలను శనివారం రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కోమటిశెట్టి గంగాధర్ రైతులకు విత్తనాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వ సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, ఉప సర్పంచ్, క్లస్టర్ రైతులు, రెంజర్ల - నాగంపేట్ కాంగ్రెస్ నాయకులు, మండల వ్యవసాయ విస్తరణ అధికారి, సొసైటీ సెక్రెటరీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.